# వైతరణి

అప్పట్లో ఆమె "నాగమ్మ" అని పిలువబడేది ఆ వూరిలో - అంటే రంగా పురంలో - చాలా అమాయకంగా ఉండేది. అత్త మామలంటే భక్తిగా, భర్త అంటే భయంగా ఉండేది. అత్తింటి కాపురం ఏణ్ణర్థం అనుభవించింది - అదీ పూర్తిగా అనటానికి వీలులేదు. యమయాతనా పడ్డది. లంకంత ఆ కొంపలో ఒక్కతె వెట్టి చాకిరి చేయాలి - ఇంటిల్లిపాదికీ వండి పెట్టటం నుండి, తోట పొలం వెళ్ళి చిన్న పని, పెద్దపని చేయాలి. మరుదుల ఆగ్రహాలు, ఆడబిడ్డల అదలాయింపులు సహిస్తూ నిజంగా అత్తింటి కాపురపు అఘాయిత్యాన్నంతా చవి చూచింది. అయినా తలలోని నాల్కవలెనే మెలిగింది.

నిత్యకృత్యమంతా నిగ్గ తీసికొని రాత్రి ఏ 11 గంటలకో పడకటిల్లు చేరేది, మరునాడు ఎంత పెందలకడ లేవవలసినదీ ఆలోచించుకొంటూ. తీరా ఆ పడకటిల్లు తన్నొంటరిగా ఆహ్వానించేది - ఆ గదిలో ఉండవలసిన "రాజేంద్ర భోగి" తాను క్రొత్తగా కాపురాని కొచ్చిన ఏ కొద్ది రోజులకోతప్ప ఆ తరువాత కన్పించటం మానవేశారు. మరి ఆయన గ్రామ పంచాయితి ప్రసిడెంటు - వూరిలో మోతుబరి. వీటన్నింటికిమించి ఆయనకు చిరకాలంగా "ఇలాకా" వున్న ఆడవాళ్ళు చాల మంది ఉన్నారా వూరిలో. ఈ విషయాన్ని తెలిసిన నాగమ్మ - ఆ గదిలో ఒక్కతే బిక్కుబిక్కుమంటూ, చీకటిగా వున్న తన జీవితాన్ని, భయంగా వున్న తన భవిష్యత్తును తలచుకొని గ్రుడ్ల నీరు గ్రుడ్ల కుక్కకొనేది. పగటి

అలసటకు మానసిక వ్యథ తోడు రాగా నిద్ర పోయి, రెంటిని మరచి పోవటానికి అలవాటు పడిపోయింది.

ఆమె పట్ల సానుభూతి వాక్యాలు పలికే వారు లేకపోయారు. క్రమంగా సృష్టిలో సానుభూతి అనేది ఒకటి వుందని అది తనను వూరడించగలదని మరచిపోయింది. ఎక్కడో ఎవరో ఆమె పరోక్షంలో, ఏ నీలాటి రేవులోనో, 'మన నాగమ్మకేం! పచ్చని పసిమి, చారడేసి కళ్లు, కోటేరేసిన ముక్కు, దొండపండు పెదవుల్లాంటి పెదవులు, లక్ష్మీదేవిలా ఉంటుంది. పాపం... ఇలా అన్యాయమై పోతోంది' అనుకొనేవారు.

నాగమ్మకు పుట్టింటివారు ఉన్నారని వినికిడి - కానీ లేనట్టే.

పుట్టింట ఉండటానికి సర్వ హక్కులను, చిన్నతనాననే భర్తను పోగొట్టుకొని సంపాదించుకొన్న, ఆడబిడ్డ చేతిలో నాగమ్మ జీవితం మరీ దుర్భరమైపోయింది. ఆ రచ్చబండల "రాజేంద్ర భోగి" అప్పుడప్పుడు - ఎప్పుడైనా ఇంటి కొచ్చినపుడు- అక్కగారి పితూరీలను విని కొట్టటం ప్రారంభించాడు. నాగమ్మ నోరు మెదిపేది కాదు - అసలలాంటి అవకాశం లేదామెకు. ఆ యింటిలో కుక్కకున్న గౌరవంలో పదో వంతు లేదామెకు. పెంపుడు పిల్లికున్న సానుభూతిలో శతాంశం ఆమె పట్ల చూపేవారు లేరు. ఆ ఒక్క సుబ్బయ్య తప్ప!

సుబ్బయ్యకు ఆ యింటిలో వున్న ప్రతి పత్తి ఏమిటో ఎవరికీ తెలియదు. బహుశా దూరపు బంధువేమో...నల్లగా, పొట్టిగా బక్కపలుచగా ఉంటాడు. కొంచం జులపాల జుట్టు. చాల దేశం తిరిగిన మనిషి 2, 3 భాషలు కచ్చా పచ్చిగా వచ్చు. మాసినట్లువుండే బట్టలతో - అలసటగా, ప్రయాణం చేసినచ్చినవాడిలా కన్పిస్తాడు అందరి దృష్టిలోను, అతనంత లెక్కల్లో మనిషి కాదు.

ఆ సుబ్బయ్యకు నాగమ్మపట్ల 'స్వార్థం' లేని సానుభూతి. అన్యాయానికి గురి అవుతోందన్న ఆందోళన, అప్పుడప్పుడు కొంచం పనులు చేయటంలో సాయం చేయపోయేవాడు - ఆమె కృతజ్ఞతతో తలమున్కలై పోయేది.

ఇలా వుండగా నాగమ్మకు ఆ యింటితో ఋణానుబంధం తీరేనాడు వచ్చింది. ఆ యింటి రాజేంద్రభోగి చెవుల్లో, అప్పగారు నాగమ్మ శీలాన్ని గురించి

అనుమానాన్ని నూరిపోసింది. అలా ఆమె చేయటానికి కారణం - ఆ నాటితో, ఆమె మామూలు పితూరీల భాండాగారం వట్టిపోవటం మాత్రమే!

నాగమ్మ దోషం వివరంగా అర్ధం కాకున్నా స్థూలంగా ఆమెకు పెద్ద శిక్ష వేయవచ్చు అనే నిర్ణయాని కొచ్చిన ఆమె భర్త, "పశువుకంటే, హీనంగా" శిక్షంచాడా" రోజు. ఆలా శిక్షిస్తూ అతనే పశువయ్యాడు. ఆమెలోని ప్రతి భావం నశించేలా - చివరకు ఎదుటివాడు భర్త అనే భావన కూడ నశించేలా - శిక్షించాడు.

అనాది కాలంనాటి అందరి ఆడాళ్లలాగే నాగమ్మ ప్రతీకారం చేదామను కొంది - 'నూతిలోపడి మరణించి'. అర్ధరాత్రి అలాగే ప్రయత్నించపోయింది.

సుబ్బయ్య కనురెప్పలా కాచుకొని కూర్చొన్నాడు. అడ్డుపడ్డాడు.

"ఎందుకు ఈ జీవితం?" జాలిగా చూచింది. సుబ్బయ్య మనసు కరిగిపోయింది. వోదార్చాడు.

"ఈ జీవితానికంటే మంచి జీవితం అనుభవించవచ్చు. చచ్చిపోవటం కంటే పారిపోవటం తప్పు కాదు. అంత కష్టమూ కాదు. ఈ పల్లె దాటితే విశాల ప్రపంచముంది. ఆకాశముంది, గాలి, నీరు వున్నాయి చాల మంది సానుభూతి పరులు, ఎన్నో భాషలు వచ్చినవారు - క్రొత్త జీవితాన్ని వెళ్లతీయటానికి ఎన్నో జీవన రీతులు - 'చాల మంచివే' ఉన్నాయి. "- అన్నిటికీమించి చావటం మంచిది కాదు -" అన్నాడు.

ప్రాణి నైజం, బ్రతకాలనే ఆమె స్వాధీనం తప్పిన ఇచ్ఛ, రెక్కలల్లార్చాయి. ఆమె భర్త కొట్టకముందైతే స్త్రీ - భర్తకు దూరంగా జీవించరాదనే భావం దొర్లేది. కాని ఆభావాన్ని చంపేశాడతను.

తెల్లవారేసరికి భయంగానే సుబ్బయ్య వెంట నాగమ్మ కట్టు బట్టలతో వెళ్లి పోయింది రంగాపురం పొలిమేరలు దాటి, భగవంతుని మీద భారంవేసి. సుబ్బయ్య తనదైన కొంచం పైకం తెచ్చాడు వెంట.

★ ★ ★

బస్తీ చేరాక - ఓ వూరింటిని అద్దెకు తీసికొని జీవితం ప్రారంభించారు నాగమ్మ, సుబ్బయ్య.

నాగమ్మ మొదట్లో మొదట్లో మానసికంగా చాల వ్యథకు గురైంది; తనకు సుబ్బయ్యకు మధ్యనున్న 'ఏమీ లేని పొత్తును' చుట్టు పట్ల వారందరూ మరోలా అర్థం చేసికొంటారేమోనని. కాని చిన్న చిన్నగా గ్రహించింది; ఆ బస్తీలో తనను గురించి ఆలోచించేపాటి తీరిక వున్నవారెవరు లేరని, అసలు నీతి నియమాలను గురించి మాట్లాడే మషులు పల్లెటూళ్లలోనే ఉండిపోయారని.

"గేదెలను పెట్టుకొని, పాలమ్ముకొంటూ ఈ జీవితాలను కొనసాగిద్దాం" అన్నాడు సుబ్బయ్య.

"సరే" నంది నాగమ్మ, సుబ్బయ్య గేదెలను మేపటం, వాటి చాకిరి చేయటం, పాలమ్మటం - చాల శ్రమించేవాడు. కొన్నాళ్లకు దీనికి తోడు కిల్లీ బంకొకటి పెట్టాడు.

"జీవించాలంటే క్రొత్త మార్గాలు చాల ఉన్నాయి" అన్న సుబ్బయ్య మాటలలోని నిజాన్ని గ్రహించింది నాగమ్మ. అతని పట్ల సానుభూతిగా, కృతజ్ఞతగా ఉండేది. తన కోసం ఎంతగానో శ్రమిస్తున్నాడు!

చిన్నగా నాలుగు రాళ్లేర్పడ్డాయి. తన పాత ఆశ్రమంలో కట్టిన బట్ట, తిన్న తిండి కంటే మెరుగైంది జీవితం. సినిమాలు, సర్కస్‌లు, నాటకాలు చూచింది. జీవించాలనే ఉత్సాహానిచ్చాయవి. తన కట్టు, బొట్టు, పద్ధతులు, తనకు తెలియకుండానే మారిపోయాయి. ఆశ్చర్యపోయిందోనాడు - తనను తానే అద్దంలో చూచుకొని, తనలో ఏదో విప్పారిన స్వాతంత్ర్యం, తనకు తెలియకుండా దాగివున్న శరీర కాంతి - సౌందర్యం!

మొదటిసారిగా, జీవితంలో తాననుభవిస్తున్న దానిని, తా ననుభవించటానికి గల్గ హక్కును గురించి ఆలోచించింది. ఆ రాత్రంతా నిద్దుర పట్టలేదు. వెన్నెల వేడి, చిరుగాలి, పూలవాసన అన్నీ తనను వేళాకోళం చేశాయి. వీటన్నింటికి మించి 20 సంవత్సరాలు నిండిన తన యవ్వనం వెక్కిరించి వేధించింది.

ఆనాటి తెల్లవారుజామున, లేచి గొడ్ల దగ్గర బాగుచేసి, పాలు పితికి, డబ్బాలో పోసికొంటున్న సుబ్బయ్యను చూచి జాలి పడింది. తనలాంటి ఎడారి జీవితమే అతనిదీను అని. కాని సుబ్బయ్యకు అలాంటి అసంతృప్తి లేదు!

ఒకటి రెండు రోజుల తర్వాత - ఎదురుగావున్న మేడ మీద కాంట్రాక్టరు 'అవధాని' తనకేసి అదేపనిగా చూడటం గమనించిన నాగమ్మ తన్నొకసారి చూచుకొని చిన్నగా నవ్వుకొంది. అవధానిగారు ఆ తరువా తొకసారి కలిపించుకొని పలకరించారు. ఆయనకు భార్య గతించింది. కొంచం ఎదిగిన పిల్లలున్నారు. చదువు కొంటున్నారు.

సుబ్బయ్య బంకు మీదకు వెళ్లిననపుడల్లా 'అవధాని' నాగమ్మ ఇంటికొచ్చి మంచీ చెడ్డా మాట్లాడుతున్నాడు. నాగమ్మ గత చరిత్రను, నడుస్తున్న చరిత్రను విని- "నీలాంటి వికసిస్తున్న పుష్పం, పరిమళాన్ని వెదజల్లకుండా వాడిపోకూడదు" అన్నాడు.

"నీవు పుష్పానివి, నేతు తుమ్మెదలాంటి వాడిని" అన్నాడు నాగమ్మ వెనుక ముందులాలోచించింది. 'సంఘం, నీతి న్యాయం... ఇహం... పరం... అన్నీ' ఆలోచించింది.

"అవన్నీ బూటకాలు" అంటూ ఉపన్యాసపు మత్తు కురిపించాడు అవధాని. ఆ తరువాత నాగమ్మ అవధాని పిల్లలు స్కూలుకు వెళ్లాక అతని మేడ మీదకు వెళ్లటం ప్రారంభించింది.

అవధాని, నాగమ్మ భర్త మీద భరణానికి దావా వేయవచ్చునని చెప్పాడు. నాగమ్మ సుబ్బయ్యతో చెప్పిందీ విషయాన్ని.

"పోనిద్దూ మన బతుకు మనం బ్రతుకుతున్నాం - ఆ పాడాస్తి మన కెందుకు?" అన్నాడు.

"అది కాదు. ఎన్నాళ్లని ఈ పాల వ్యాపారం? సంఘంలో గౌరవమా, అంతస్థా? అదేదైనావస్తే మరేదైనా వ్యాపారం పెట్టుకొని జీవించవచ్చుగా-" అంది.

"ఈ కోర్టు గొడవలు మనం పడలేము."

"మనం గొడవ పడేదేం లేదు - అంతా 'అవధాని' గారు... ఆయనే చూచుకొంటామన్నారు. కావలసిన పెట్టుబడి వారే పెడతారు -"

సుబ్బయ్య మొదటిసారిగా నాగమ్మను తేరిపార చూచాడు. ఆమెలో 'పగ' లాంటి ప్రతీకార వాంఛ. పగలాంటి ఆలోచన. అన్నింటికిమించి తన చుట్టూ

ఆశలు పెంచుకొని. జీవితాన్ని సార్థకం చేసికోవాలనుకొంటున్న స్త్రీత్వం, కన్పించాయి. క్షణం విచలితుడయ్యాడు. అతని కేదో సాంఘిక న్యాయం గోచరించింది నాగమ్మ మాటలలో. 'నీ ఇష్టం' అని వెళ్లిపోయాడు కిల్లీ బంకుకేసి.

నాగమ్మ రిజిష్టర్డు నోటీసు చూచుకొని, భరణం ఇచ్చుకోవటం కంటే విడాకులు పుచ్చుకోకుండా, అత డాడిన, రెండవ వివాహం జైలుకు పంపుతుందేమో నన్న భయం వెంటాడగా, గ్రిరున వచ్చి పడ్డాడు, ఆమె భర్త; నాగమ్మ దగ్గరకు. నాగమ్మను ఈ కొత్త సోయగంలో చూచి ఆశ్చర్యపోయాడు, "ఇలాంటి సౌందర్య రాసినా తాను కాల రాచింది -" అని.

ప్రక్కన వచ్చిన ప్రవేటు ఆచారి కొన్ని పాచికలు వేశాడు. నాగమ్మ ముందు. "గతం గతించిందనుకో. అది కలే అనుకో. ఏ పూర్వ జన్మ కర్మ ఫలమో నీలాంటి సుగుణాలరాశి నుండి అతనిని దూరం చేసింది. అన్నింటిని మరచిపోయి నీవు తిరిగి వచ్చేస్తే నిన్ను పువ్వులలో పెట్టి పూజిస్తాడు నీ భర్త" అని మామూలు మంత్రించే మాటలు వల్లించాడు.

నాగమ్మ క్షణ కాలం వెనక్కి తిరిగి ఆలోచించింది. పాప పుణ్యాలను గురించి వాళ్ల మామ్మ చిన్ననాట చెప్పిన గాథలు ఎన్నో గుప్పున గుబాళింపగా- పోనీ వెనక్కి వెళ్లి పోదామనుకొంది - రంగాపురం.

వెళ్లిపోయేదే, అవధాని కారు వచ్చి ఆ క్షణాన అక్కడ ఆగి వుండకపోతే! క్షణంలో అంతా గ్రహించిన అవధాని - ఆచారి కంటే పెద్దచెయ్యనిపించాడు - ఫలితం?

'తిరిగి వెళ్లితే తనకక్కడ ఒక భూతల స్వర్గం కాదు సిద్ధంగా వుంది - పల్లెటూరు. చెరువు నీరు, పశుగ్రాసం మోసికొని రావలసిన మొద్దు చాకిరి, జొన్నకూడు, ఆడబిడ్డల అహంకారం...గత జీవితం కంటే హీన జీవితం... వీటన్నిటిని మించి క్రొత్తగా ఆ గృహం చేరిన మరో జీవితో నిత్య సంఘర్షణ - కన్పించాయి నాగమ్మకు ఒక కంటిలో-

మరో కంటిలో 'అవధాని' కారు - మేడ, అతడితోటి షికార్లు, సినిమాలు, గాలి పొరల్లాంటి షిఫాను చీరలలో తేలిపోవటం, పెద్ద వ్యాపారం, నౌకర్లు, చాకర్లు కన్పించారు.

ఏమీ తోచలేదు. 'ఏం చేయమంటావ్?' అంది సుబ్బయ్యతో. సుబ్బయ్యకు ఏమీ తోచలేదు - 'నీ ఇష్టం' అన్నాడు.

రానని చెప్పింది. దావా వేస్తానని ఖచ్చితంగా చెప్పింది. ఇకనైనా ఆ క్రొత్త ఇల్లాలిని అన్యాయం చేయక బుద్ధిగా ఉండమంది.

కొంత ధనాన్ని చెల్లించి తెగ తెంపులు చేసికొని వెళ్లిపోయాడు నాగమ్మ భర్త.

సుబ్బయ్యా, తాను కష్టించి ఆర్జించిన ధనం, దీనికి జత చేసి అవధాని చేతిలో పోసి అతని వ్యాపారంలో భాగస్వామిని అయింది. 'నీ ఇష్టం' అని మాత్రమే అనగల్గాడు సుబ్బయ్య - 'కిల్లీ బంకు తీసి వేసి ఆ పూరిల్లు మార్చి, అవధాని బంగళా కాంపౌండులోవున్న మరో యింటిలోనికి బస మార్చుదాం, అన్న నాగమ్మకు.

కాంట్రాక్టరు అయ్యాక నాగమ్మ హోదా పెరిగింది. నాగమ్మ నాగుమణి అయింది. చేతిలో చిన్న వానిటీ బ్యాగ్, కాళ్లకు ఎత్తుపాటి చెప్పులు, మెడలో ఒంటి పేట ముత్యాల హారం వచ్చిపడ్డాయి. మెరుగు దిద్దిన బంగారంలా శరీరం మెరిసి పోయింది. సాన పెట్టిన రత్నంలా మనసు వికసించింది. ఇదివరలో అవధానితో తిరగటం నాగమ్మకు హోదా అయితే - నాగుమణితో కారులో వెళ్లటంవలన అవధానికి హుందా పెరిగిందిప్పుడు.

నాగుమణి కారుతో వస్తే ఏ ఆఫీసరైనా ఇట్టే పని చేసి పెట్టేవాడు - ఏ టెండరైనా ఇట్టే తమ్మ పేర వచ్చి పడేది.

సంవత్సరం తిరిగేపాటికి నాగుమణికి ఒకటి రెండు ఫ్యాక్టరీలలో సగ భాగాలు - కొన్ని కంపెనీలలో షేర్లు వచ్చి పడ్డాయి. మోజుకొద్దీ వో పెద్ద కాంట్రాక్టరు ద్రాక్ష తోటొకటి కొనిపెట్టాడు.

"నాగుమణి నివాస్" అనే మూడంతస్తుల మేడొకటి లేచి నిటారుగా నిలబడింది - "సిరిదా వచ్చిన వచ్చు" అంటూ. ఆ భవనంలో వేర్వేరు గదులు. ఆఫీసు గది - డైనింగ్ హాలు... షవర్‌బాతురూమ్సు, మొజాయిక్ ఫ్లోరింగ్... ఎయిర్ కండిషన్డు గదులు - ఇంత పెద్ద భవనాన్ని మూడు నెలల్లో తయారు

చేయటంలో ఇంజనీర్ల ప్రతిభ ఎంత వుందో - సుబ్బయ్య శ్రమా అంత ఉంది. కూలీల చేత సిమెంట్ మోయించటం నుండి - గృహ ప్రవేశంనాటి డిన్నర్ పార్టీకి, డాన్సు ప్రోగ్రాముకు, కుర్చీలు వేయించి, తీయించటం వరకు అతని ప్రమేయ ముంది.

కాలం మరికొంత మేరకు గడచేపాటికి నాగుమణికి ఫోను చేసి అనుమతి తీసికొని రావలసిన పరిస్థితి ఏర్పడ్డది అవధాని'కి. అవధానిని 'మీరు, మీరు' అనే నాగుమణి, 'నీవు నీవు' అని ఏకవచన ప్రయోగం చేయటం ప్రారంభించింది.

ఆ యింటికి వచ్చేవారిలో అవధాని ఒకడయ్యాడు. కాలం అలానూ గడవలేదు. అవధాని పిల్లలు చదువులు సరిగ్గా గడవక మేనమామల ఇండ్లకు వెళ్లారని వార్త పుట్టింది. ఆ వార్త నిజమో, కాదో లోకం తెలిసికొనేపాటికి అవధాని వ్యాపారం మూసేసి ఇల్లు అమ్ముకొని వెళ్లిపోయాడు- "సిరిదా పోయిన పోవును" అన్నట్లైంది.

అవధాని బంగళాను తానే తీసికొని గెస్ట్ హౌస్ చేసింది నాగుమణి. అవధాని ఆ వూరు నుండి వెళుతున్నానని చెప్పటానికని నాగుమణికి ఫోను చేసేపాటికి, మేడ మీద పడక గదిలో డన్‌లప్ తలగడల మధ్య, రాత్రి బాల్‌రూమ్ డాన్సు ప్రోగ్రామ్ నుండి మోసికొని వచ్చిన అలసటను తీర్చుకొంటున్న, నాగుమణి ఆ పిలుస్తున్న దెవరో వూహించి - ఫోను ఎత్తటం మాని వేసింది.

'రింగ్' అయి, 'రింగ్' అయి ఫోను మూగపోయింది అరణ్య రోదనలా. బజారు నుండి వస్తోన్న సుబ్బయ్యకు అవధాని స్టేషనుకు వెళుతూ కన్పించాడు - "సుబ్బయ్యా..... వెళుతున్నా.... చూచావా, నాగమ్మ నన్నెలా బికారిని చేసిందో.... పెద్దదయిపోయింది. చాలా పెద్దదయింది. నీ పనీ నాలాగే ముగుస్తుంది ఏనాడో-" అన్నాడు.

సుబ్బయ్య మౌనంగా విన్నాడు. అతనికేం అర్థం కాలేదు. నాగమ్మ తప్పే ముంది? అతని దృష్టిలో ఆనాటి రంగాపురంలోని నాగమ్మే కన్పిస్తోంది. సంఘం చేత అన్యాయం చేయబడిన నాగమ్మ..... "ఆ... ఇంతకు ఇంతా అనుభవిస్తుంది. నన్నూ నా పిల్లలనూ బజారు పాలు చేసింది - దిక్కులేని వాళ్లను చేసింది. కులట' ' అన్నాడు అవధాని.

'ఎందుకిలా ఆమెను దూషిస్తాడు' అనిపించింది సుబ్బయ్యకు.

'వస్తా' అని వెళ్ళిపోయాడు అవధాని.

ఇంటి కొచ్చాక సుబ్బయ్య ప్రయాస పడి పై అంతస్తుకు వెళ్లి పడక గది తలుపు తట్టాడు. నాగుమణి సగం నిద్ర లాంటి మత్తు నుండి బద్దకంగా వచ్చి తలుపు తీసింది. సుబ్బయ్య ఆమెను చూచి గతుక్కుమన్నాడు. ఇలాంటి వేషంలో ఏనాడూ నాగమ్మ తనకు కన్పించలేదు. చెదిరిపోయిన జుత్తు - జ్యోతుల్లాంటి కళ్లు. ఎంత మారిపోయింది!

సుబ్బయ్యను నాగమ్మ క్రింది నుండి పైకి ఒక్కసారి చూచింది. ఆ సగం మాసిన పంచ..... చినుగుల పట్టిన చొక్కా, జులపాల జుత్తు, మీద పంచ..... రంగాపురంలో తన్ను ప్రోచి రక్షించిన నాటి సుబ్బయ్యే!

"సుబ్బయ్యా! ఎన్ని మారులు చెప్పాను నీకు, ఆ బట్టలు మార్చమని. నీ కోసం గ్లాస్కో పంచలు, టెర్లిన్ చొక్కాలు తెప్పించానుగా" అంది నాగమ్మ.

ఎప్పటిలాగానే ఆ ప్రశ్నకు సమాధానం లేదు. కొన్ని క్షణాల తరువాత - 'అవధాని వెళ్లిపోయాడు!' అని చెప్పాడు.

'ఊఁ' నిర్లక్ష్యంగా లోనికి వెళ్లింది నాగమ్మ.

ఏదో చెప్పాలనుకున్న సుబ్బయ్య ఏమీ తోచక - అన్ని మెట్లూ దిగి తన గది కొచ్చి సోఫా ప్రక్కగా చాప వేసికొని కూర్చొని ఆలోచించాడు నాగమ్మను గురించి. అవధాని చెప్పినట్లు మరీ పాడయిపోతున్నదా? అని. ఏమీ అర్థం కాలేదు. రంగాపురంలో ఆమె అనుభవించిన ఒక్కొక్క దుష్ట క్షణం - ఇక్కడ ఒక్కొక్క అదృష్ట దినంగా గడచి పోతోందేమో.... దేవుడెవరికి అన్యాయం చేయడుగా మరి - అనుకొన్నాడు. ఈ పచ్చి విలాస జీవితం, ఈ త్రాగుడు, రోజుకో లక్షాధికారి నాగుమణి చుట్టూ తిరిగిపోవటం.... ఆఫీసర్లు నాగుమణి చెప్పి చోట్లల్లా సంతకాలు చేయటం.... ఏమిటేమిటో ఆలోచిస్తూ వుండిపోయాడు సుబ్బయ్య.

పైన నాగుమణి బద్దకంగా వంట మనిషి తెచ్చిన కాఫీ త్రాగుతూ ఆలోచించింది సుబ్బయ్యను గురించి.... తన శ్రేయోభిలాషి... స్వసుఖాన్ని..... తనకు సంబంధించిన మరి దేనిని గురించి ఆలోచించలేని మనిషి. తన ఈనాటి

భోగాల అంతస్తుకు వినియోగపడిన మొదటి మెట్టు. "పాపం!" అనుకొంది, కాఫీ గ్లాసు ట్రేలో ఉంచుతూ.

ఫోను పిలుపుతో ఆలోచనలు ఆగిపోయాయి.

"హల్లో....నాగూ" అవతల నుండి క్రొత్తగా రాత్రి హోటల్ బార్‌లో పరిచయం అయిన కుర్రాడి పిలుపు. ఏదో ప్రాంతపు జమిందారుగారి సుపుత్రుడు.

"హలో"

"సుఖంగా నిద్ర పట్టిందా....... నిన్ను 'డిస్టబ్' చేయటం ఇష్టం లేకనే ఇంత వరకూ ఫోను చేయలేదు. బై ది బై 'లంచ్'కి నా 'కాటేజీ'కి రావా నాగూ" ఏడ్చినట్లు ప్రార్థిస్తున్నాడు.

"ప్రయత్నిస్తాను-"

"ధన్యుణ్ణి! వేయి కళ్లతో ఎదురు చూస్తూ ఉంటాను."

"వో. కే." ఫోను పెట్టేసి 'నాగు' మత్తుగా ఆలోచించింది. తన ఈ సౌందర్య రమ్య హర్మ్యం చుట్టూ, ఎందరు వెంపర లాడుతున్నారు? తనదంతటి భ్రమింపచేసే సౌందర్యమా.....? ఒక్కసారి నిలువుటద్దం ముందు నిలడి తేరిపార చూచుకొంది.

ఆ అద్దంలో తన ప్రతిబింబం లేదు. బూదర బూదరగా రంగాపురంలోని నాగమ్మ కనిపించింది. ఆ ముతక కోక, మట్టిగాజులు, కుంకుమ బొట్టు - అమాయకమైన సేవామూర్తి.

గతుక్కుమంది. మరుక్షణంలో ఆ రూపు కరగిపోయి...... ముడతలు పడిన శరీరం, ఫలిత కేశాలు.... జారిపోయిన యవ్వనం, ఎర్రటి రక్తపు మడుగు లాంటి నిజంలో మరణించిన సౌందర్యం..... కన్పించాయి..

కెవ్వున కేకవేసి కూలిపోయింది. మరో ఫోను పిలుపు..... ఎవరో ఆఫీసరు ఏదో కాంట్రాక్టు బాపతు బిల్లు.... చెక్ కావాలా క్రాస్ చేయమంటారా..... అని అడిగాడు.

సమాధానం చెప్పి, స్నానం చేసి టాయిలెట్ అయి క్రిందకు వచ్చింది నాగు. గ్యారేజిలోని కారును శుభ్రంగా తుడిపిస్తోన్న సుబ్బయ్య కనిపించాడు. కారును తీసికొని పోర్టికోలోకి సరిగ్గా వచ్చేప్పాటికి, ఎవరో ఇద్దరు పిల్లలు. ఒక ఆడపిల్లా

ఆమె చిట్టి తమ్ముడు, అనాథలట. చందా కోసం వచ్చారు.

నాగమ్మ వాళ్ల మాటలు ఆసాంతం వింది. ఆ చిన్న కుర్రవాణ్ణి ఎత్తుకొని ముద్దాడి ఏమిటో నిలువెల్లా తేరిపార చూచింది - వెర్రి దానిలా.... ఏదో వెలితిగా, దేనినో పోగొట్టుకున్న దానిలా నోట్ల కట్ట నాక దానిని పిల్లవాడి చేతిలో పెట్టింది. పిల్లలిద్దరూ తెల్లపోయి భయంగా చూచారు.

వాళ్లకేసి దిగులుగా చూచి కారు స్టార్టు చేసింది. సుబ్బయ్య ఆశ్చర్యపోయి చూచాడు. రేగుతున్న దుమ్ము నుండి దూరంగా నాగమ్మ టెర్లిన్ చీర కొంగు రెప రెప లాడుతూ, కేతనంలా గోచరిస్తోంది. పిల్లలు వెళ్లిపోయారు.

సుబ్బయ్యకు గుప్పున జ్ఞప్తికి వచ్చారు అవధాని పిల్లలు. ఏదో ఆలోచించాడు. అవధాని మాటలు జ్ఞాపకానికొచ్చాయి. "నా పిల్లలు అన్యాయమై పోయారు-" అని.

ఆలోచనలలో మునిగిపోయాడు. అలా ఆనాడల్లా ఆలోచనలలోనే ఉండి పోయాడు సుబ్బయ్య. అవును ఏదైనా సాయం అవధాని పిల్లలకు చేస్తేనో. ఈ విషయం నాగమ్మకు చెప్పాలనిపించిది. ఏమనుకొంటోందో. తన వలన అన్యాయమైన వాడికి ఆ మాత్రం సాయ చేయదా!..... ఎవరు ఎవరి వలన అన్యాయమై పోయారు? అవధాని వలన - నిజంగా అన్యాయమైపోయింది నాగమ్మ. ఎక్కడో మారుమూల పూరిపాకలో, చాకిరీ చేసికొని, జీవితాన్ని వెళ్ల తీసుకొనటమే వ్యాపకంగా బ్రతుకుతున్న నాగమ్మను ఈనాటి వ్యసనాల పుట్టగా చేసిందెవరూ?... అవధాని గాదూ....?"

"అయినా అవధాని పిల్లలకు సాయం చేయాలి -" అనుకొన్నాడు. నాలుగు దిక్కుల సంధ్య క్రమ్మి చీకటి పడి రాత్రి వచ్చింది. "నాగుమణి నివాస్" నియాన్ లైట్లతో వెలిగి పోయింది..... సుబ్బయ్య వరండాలో నాగమ్మ రాక కోసం ఎదురు చూస్తూ ఉండి పోయాడు....... పది గంటలకు నాగు వచ్చింది.

వస్తూనే తన కోసం ఎదురు చూస్తున్న సుబ్బయ్యను, "భోజనం చేశావా?" అనడిగింది.

"లేదు."

"నీ కెన్ని సారులు చెప్పాను. నేనెక్కడో తిని వస్తాను. ఎనిమిది గంటలకల్లా నిన్ను భోజనం చేయమని. ఇలా అయితే నీ ఆరోగ్యం నాశనమవ్వదూ?"

సుబ్బయ్య మాట్లాడలేదు.

'వెంటనే భోజనం చేసెయ్" అంటూ మెట్ల మీదుగా నడచి పైకి వెళ్లిపోయింది. నాగమ్మ మాట్లాడుతున్నప్పుడు నోటి వెంట వచ్చిన వాసనకు సుబ్బయ్యకు డోక్కున్నంత పనైంది. భోజనం చేస్తున్నంత సేపు తానెలా ఈ విషయం నాగమ్మతో మాట్లాడవలసినదీ ఆలోచిస్తూనే ఉండిపోయాడు.

ఏలాగైతేనేం వో నిర్ణయాని కొచ్చి, పై అంతస్తులోని నాగమ్మ గది దగ్గరకు బయలు దేరాడు. రాత్రి పదకొండు గంటలయింది. లోపల లైట్లు వెలుగుతున్నాయి. ఎవరో గొల్లున నవ్వుతున్న అలజడి. గ్లాసులలో ఏదో పానీయం పోయబడుతోన్న సన్నటి ధ్వని. కిటికీ గాజు తలుపులపై నల్లటి పాపలు. సుబ్బయ్య కిటికీ దగ్గరే ఆగి పోయాడు. మసక మసకగా లోపల ఆకృతులు ఒకటి నొకటి పెనవేసి కొని విడిపోతున్నాయి మత్తుగా తూలుతూ.

సుబ్బయ్య చూడటం మానివేసి నేలను చూస్తూ వుండి పోయాడు. టేపు రికార్డర్ నుండి ఇంగ్లీషు సంగీతం వినవస్తోంది. మధ్య మధ్య మాటలు అస్పష్టంగా విన వస్తున్నాయి.

"సుబ్బయ్యనా?" ప్రశ్నిస్తోంది నాగమ్మ.

"అవును. నిన్ను గురించి, వాణ్ణి గురించి లోకమేమనుకొంటోందో తెలుసా? నీవు కడిగిన ముత్యానివి. స్వర్గానివి. వాడో కుక్కలాంటివాడు. వాడెందుకు నీ పంచన. తోలేసెయ్."

తనను గురించిన ప్రసంగాన్ని కొంచెం శ్రద్ధగా విన్నాడు సుబ్బయ్య. నాగమ్మ ఆకృతి గాజు తలుపులమీద లేచి నిలువబడి తూలింది.

"సుబ్బయ్య ఎక్కడికీ వెళ్లడు. ఇక్కడే ఉండాలి" అంది.

"అదికాదు నాగూ! ఈ సంఘంలో మన హోదా, అంతస్తు ఎలాంటివి? నన్ను చూచి నవ్వుతున్నారంతా. ఆ సుబ్బయ్య నీ మాజీ ప్రియుడని. వాడింకా ఇక్కడే ఉండగానే, నే నిక్కడకు వస్తున్నాను. నా కవమానంగా వుంది. నా

మాటలు విని వాణ్ణి పంపేసేయ్. కావాలంటే నాలుగు రాళ్లు వాడి మొఖాన కొట్టి వదలించుకో"

"వీల్లేదు" మత్తు మందు నిషాలో కూడా స్పష్టంగా పల్కింది.

"డియర్.... అయితే ఇంతేనా... పోనీ వాణ్ణి వెళ్లమనవద్దు - మనమే వెళ్ళిపోదాం, ముందు ఊటీలో నా బంగళాకు. ఆ తరువాత 'ఇంగ్లండులో స్థిరపడిపోదాం. అక్కడ సముద్రపు టొడ్డున నాకో పెద్ద బంగళా వుంది." దీనంగా అర్థిస్తున్నాడు ఆ కోటీశ్వరుడు.

సుబ్బయ్య వణకిపోయాడు.

నాగమ్మ ఆకృతి మత్తుకు నిలువలేక తూలి బెడ్ మీద పడిపోయింది. రెండవ వ్యక్తి చాల సేపు నాగమ్మను లేపి కూర్చోపెట్టాలని, మాట్లాడించాలని ప్రయత్నించి లాభం లేక బయటకు నడిచాడు. సుబ్బయ్య కర్టెను వారగా నిలువ బడి, అతని దృష్టి నుండి తప్పుకొన్నాడు.

కొన్ని నిమిషాల తరువాత క్రింద కారు బయలు దేరిన ధ్వని వినిపించాక - సుబ్బయ్య నాగమ్మ గదిలోకి వెళ్లాడు. లైట్లు పట్టపగల్లా వెల్గుతున్నాయి. టేప్ రికార్డర్ నుండి ఇంగ్లీషు సంగీతం జోరుగా వస్తోంది. ఖాళీ సీసాలు, సగం..... సగం ఖాళీ చేయబడిన గాజు గ్లాసులు ట్రే నిండా నింపబడి ఉన్నాయి. ప్రక్కమీద సగం క్రిందకు జారిపోతూ, అర్థ నగ్నంగా చెదరిపోయిన జుత్తుతో, మొఖ మొక మెత్తల మధ్య....... బూరుగు దూది తలగడల ఆసరాతో విరిగిన శిల్ప కళాఖండంలా, తెగిన వీణాతంత్రిలా, మణిలేని నాగులా సొక్కి సోలిన నాగమ్మను చూచి వణకి పోయాడు సుబ్బయ్య - సానుభూతితో.

అతని కంటిలో రెండు అశ్రుకణాలు తళుక్కుమన్నాయి. సగం క్రిందకు వ్రాలి వున్న నాగమ్మ శరీరాన్ని చిన్న పక్క మీదకు దొర్లించేపాటికి చెమటలు పట్టాయి. కాశ్మీరు శాలువా తీసి కప్పబోయాడు.... ఆ పగిలిన కాంతులను వెద జల్లుతూన్న సౌందర్యం మీద. నాగమ్మ కొద్దిగా కదిలింది. ఏదో అస్పష్టంగా పలరించింది- 'దాహం' అన్నట్లు విన్పించింది. సుబ్బయ్యకు. చూట్టూ చూచాడు. ఎక్కడా నీళ్లు లేవు. "రెఫ్రిజిరేటర్"లో నుండి ఒక్కటే ఒక్కటి మిగిలిపోయిన సోడా

తెచ్చి, కార్కు తీసి గ్లాస్‌లో పోసి, కొంచంగా ఆమెను పైకి ఎత్తి త్రాగించాడు. సోడా త్రాగాక, కొంచం అరమోడ్పుగా కనులు తెరచి పలవరించటం మొదలు పెట్టింది నాగమ్మ. టేపులోని సంగీతం గంద్రగోళంగా వుంది.

"వీల్లేదు..... సుబ్బయ్య ఇక్కడే ఉండాలి. అది అతని జన్మహక్కు. కాదు ఈ భవనానికి అతను ధర్మకర్త. ఈ శరీరానికి గార్డియన్. అతను కుక్క కాదు. మీరే కుక్కలు. అంతకంటే హీనులు.... అవును. అతనే కుక్క. అందుకనే నా పట్ల అతనికీ వాత్స్యలం, విశ్వాసాలు. ఈ మనుష్యుల కంటే గొప్పవాడు - మహోన్నతుడు..... మీరు ఈ శరీరాన్ని ముక్కలు ముక్కలుగా అనుభవించి - పిప్పి చేసి పారిపోతారు..... అతను ఆ మిగిలిన కంకాళాన్ని పదిల పరచి దుఃఖిస్తాడు. నా కోసం - నాకు అతనే..... అతనే కావాలి......."

సుబ్బయ్యకు ఈ పలవరింతలతో చలి లాంటి భయం ఆవరించింది. నాగమ్మ మళ్లీ ప్రారంభించింది-

"నేను, ఊటీ, జపాను రాను. సుబ్బయ్య లేని ఊటీ..... జపాను నా కక్కర లేదు. అవి రంగాపురం కంటే బాగుండవని నాకు తెలుసు. జపానులోని నీ సముద్రపు ఒడ్డు బంగళా, నే నిదివరకున్న పూరి గుడిసె కన్నా మేలైందేం కాదు. నేను మరణించాక నీవు నాకా జపాను దేశంలో కట్టించే గోరీలో నాకు వూపిరాడదు. ఇక్కడే ఈ జన్మ భూమిలోనే దిక్కులేవి చావే చచ్చి మట్టిలో కలిసిపోతాను..... అంతే..... నేను రాను ఫో....."

ఒక్క ఉదుటున నాగమ్మ లేచి నిలువ బోయి, సుబ్బయ్య మీదకు జారి పడ్డది. ఈ తాపుకు సుబ్బయ్య మంచం మీదకు కూలబడి పోయాడు. తన ఒడిలో నాగమ్మ - కాదు నాగుమణి - కాదు నాగు - రాజాధి రాజుల పరిష్వంగానికి అందరాని నాగు, మాసిన బట్టలు ధరించిన తన ఒడిలో. అపరాధానికి గురి అయినట్లు బాధపడి పోయాడు, నిద్రిస్తున్న సౌందర్యరాసిని అపవిత్రం చేస్తున్నట్లు. కానీ తాను లేస్తే నాగమ్మకు అలసట కలగవచ్చు. కర్తవ్యం విమూఢుడయ్యాడు.

నాగమ్మ కొంచెంగా కదలి లేచింది. సుబ్బయ్య ఆమె ముందు దోషిలా.... సిగ్గు పడుతూ..... కృంగి పోతూ నిలువ బడ్డాడు. నాగమ్మ సుబ్బయ్య కళ్లలోకి,

దగ్గరసా వచ్చి, నిశితంగా చూడటానికి ప్రయత్నించింది. జాలిగా కన్నీరు కార్చింది. ఆ ఎరుపెక్కిన కనుల నుండి పశ్చాత్తాపం వర్షిస్తున్నట్లు - "నీకు అన్యాయం చేశాను కదూ..... నీవేమైనావో..... నీ ఇష్టాలేమిటో తెలిసికోకుండా, నా ఆనంద సీమలో - కాదు శ్మశానసీమలో వూరేగుతూ...... ఇన్నాళ్లూ నీ భావాలపై నిలువెత్తు గోరీలను కడుతూ నా పాపాలకు నిన్నూ భాగస్వామిని చేశాను కదూ...... అన్నింటి కంటే అతి దారుణం..... పవిత్ర హిమ శిఖరమైన నీకు..... నా మాజీ ప్రియుడనే అపవాదు తెచ్చి పెట్టాను. ఇప్పుడు నన్నేం చేయమంటావు?" ప్రశ్నించినట్లు మాట్లాడింది.

సుబ్బయ్య మాట్లాడలేదు.

రెండు చేతులను సుబ్బయ్య భుజాల మీద వేసి, తలను ఒక భుజం మీద వాల్చి లాలనగా - 'చెప్పవూ' అంది.

'నీ ఇష్టం.'

"అయితే - ఈ శ్మశాన సౌందర్యం నా కొద్దు. ఈ వల్లకాటి వైభోగం చేదుగా వుంది. వీటన్నింటిని వదలివేసి పారిపోదాం. వెనకటి ఆ ముతక కోకతో - మట్టి గాజులతో...... కుంకుమబొట్టుతో.... దూరంగా ఎక్కడికో! నీవు తోడుగా వుంటే చాలు, జీవించగలం - జీవించలేకపోతే సంతోషంగా చచ్చిపోగలం...... ఏమంటావ్.......?"

సుబ్బయ్యకు ముచ్చెమటలు పోశాయి.

నాగమ్మ పూర్తి స్పృహలో లేదు. కానీ మాట్లాడుతోంది. ఏవో చింత నిప్పుల్లాంటి నిజాలు. నిజాల్లాంటి నీడలు తమను వెంటాడుతున్నాయి.

నాగమ్మ మాటలు ఆగిపోయాయి. మత్తులోకి తూలిపోయింది మళ్లీ. సుబ్బయ్య చిన్నగా, పచ్చి పాలరాతి శిల్ప కళాఖండాన్ని పవ్వళింపచేసినట్లు పక్కమీద నాగమ్మను చేర్చి, మొగలిరేకుపై పై పొర నుంచినట్లు, కాశ్మీరు శాలువా కంఠం వరకూ కప్పి, తలగడలమర్చి, ఫానుగాలి కావలసినంత వుంచి, చిన్న లైట్లు మినహా అన్నీ లైట్లూ ఆర్పి, టేపు సన్నగా వినిపించేలా తగ్గించి, గది నుండి బయటకు చప్పుడు కాకుండా, నడిచాడు.

నేరుగా స్నానాల గదికి వెళ్లి, ఆ బట్టల మీదే స్నానం ముగించి- బట్టలు మార్చుకొని తన గదిలో కూర్చొని ఆలోచించటం ప్రారంభించాడు.

నాగమ్మ మానసిక వ్యధకు లోనవుతోంది. వేదనకు గురి అవుతోంది. "తనకోసం!" సుబ్బయ్య సుడులు తిరిగిపోయాడు. పైగా ఆమెను ఆమే శిక్షించు కొనటానికి సిద్ధపడుతోంది. దోషి ఎవరు? నాగమ్మ జీవితాన్ని సమీక్షించి సింహావ లోకనం చేస్తే ఈనాటి ఆమె స్థితికి కారకులెవరు లెవరు?

రంగాపురంలో ఆమెకు సరైన సాంఘిక జీవితం లేకుండా చేసింది, ఆమె భర్తా..... కుటుంబమూ..... బస్తీలో ఆమె జీవితాన్ని మంటలలోకి త్రోసింది - అవధాని. ఆ తరువాత తలా ఓ సమిధా వేయగా అమే కాలిపోతోంది. దోషులంటూ వుంటే వారే! ఆ తరువాతనే ఆమె దోషి.

అసలు నాగమ్మ దోషి కాదు. దోషిగా మార్చబడింది. ఇపుడు పశ్చాత్తాపంతో వేగిపోతోంది. సుబ్బయ్యకు నాగమ్మ మాటల గుప్పున జ్ఞాపకాని కొచ్చాయి. "పారిపోదాం వెనకటి ఆ ముతక కోక..... మట్టి గాజులు, కుంకుమ బొట్టు..... జీవిద్దాం దూరంగా..... లేకుంటే చద్దాం-"

బయట ఏదో మెరపు మెరసినట్టు వెల్గిపోయింది. ప్రకృతి భీకరంగా గర్జించింది. తొంగి చూచాడు. జడివాన కురుస్తోంది. సుబ్బయ్య హృదయంపై పిడుగు పడినట్లు భయం క్రమ్ముకొంది.

"నాగమ్మ ఈ కఠినలోకంలోకి నిరాధారగా మళ్లీ ప్రయాణిస్తుందట - తాను తోడుగా వుంటే-"

మళ్లీ ప్రకృతి ఘీంకరించింది. కిటికీ తలుపులు కొట్టుకొన్నాయి టప టప. వానజల్లొక్కసారి విసరింది లోనికి.

సుబ్బయ్య కనుల ముందు ఆ భవనం విరిగిపోయి ఒక్కొక్క అంతస్తే కూలి పోతున్నట్లు - ఆ శిథిలాలక్రింద నాగమ్మ శరీరం రక్తపు ముద్దగా పడివున్నట్లు...

'అలా జరగటానికి వీలులేదు-' గొణుక్కున్నట్లు లేచాడు. సుబ్బయ్య తలుపులు తెరచుకొని, ఆ కాళరాత్రిలోనికి నల్ల కిరణంలా - ఆ భయంకర

బీభత్స ప్రకృతిలోనికి భయాణువులా- ఆ కుంభవృష్టిలోనికి నీటి తుంపరలా - ఆ పెనుగాలిలోనికి రెల్లుటాకులా - జారిపోయాడు. ఎక్కడికో - నాగమ్మకు దూరంగా.

●

## కథ వెనుక కథ :

ఒక పల్లెటూరి నుండి, మరొక వ్యక్తితో లేచి వచ్చిందావిడ. మాకు పాలు పోసే వారు వాళ్ళు. మూడు, నాలుగు సంవత్సరాలలో, తారస పడ్డ వ్యక్తుల బలహీనతల నాధారంగా ఓ పాటి వ్యాపారవేత్తగా మారిపోయిందావిడ. ఆమె నంటి వచ్చిన వ్యక్తి జీవన సరళిలో మార్పు లేదు. పాలమ్ముకొంటూ, ఆ స్థితిలోనే మిగిలిపోయాడు. మరికొంత కాలగమనంలో, వారి అంతస్తులలో ఊహించలేనంత వ్యత్యాసం ఏర్పడింది. వేర్వేరుగా వున్నా, వారికి ఒకరి పట్ల మరొకరికి విచిత్రమైన అభిమానం. అదే ఈ కథకు స్ఫూర్తి.

*[ఇరవయి సంవత్సరాలు తరువాత అతడు తన గ్రామానికి తిరిగి వెళ్ళాడు. వెళ్ళ వద్దని ఎంతగానో బతిమాలాడిన ఆమెకు నచ్చ చెప్పి మరీ వెళ్ళాడట.]*

★ *( ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక, 10-12-1965)* ★